క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పట్నంబజారు: మార్చి ఒకటి నుంచి మోటారు వెహికల్ యాక్ట్ అమలు దృష్ట్యా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఈస్ట్ ట్రాఫిక్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు నెలలుగా నూతన చట్టాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగేలా పూర్తి స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి ఒకటి నుంచి మోటారు వెహికల్ చట్టం ఉల్లంఘనకు సంబంధించి నూతన అపరాధ రుసుం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి డాక్యుమెంట్లు దగ్గర పెట్టుకోవాలని, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

కూలీ రేట్ల జీఓ విడుదల

లక్ష్మీపురం: సివిల్ సప్లయిస్ హమాలీ(ముఠా) కూలీరేట్ల పెంపు జీఓ నంబర్ 14 జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా)వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చల్లాచిన్న ఆంజనేయులు అన్నారు. ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం రేగుల రాఘవయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న సుమారు ఐదువేల మంది ముఠా కార్మికులకు వివిధ అంశాలకు పెంచిన రేట్లు గత ఒప్పందం కంటే ప్రస్తుత ఒప్పందం ద్వారా రూ.11.80 కోట్లు అదనంగా కార్మికులకు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సురేష్ బాబు, రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం రూ.మూడు లక్షల కోట్లకు పైగా అంచనాలతో రూపొందించిన 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలని హైకోర్టు న్యాయవాది గుమ్మా శ్రీనివాస్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ కేటాయింపులు జరిపిన విధంగానే ప్రభుత్వాలు తెచ్చిన అప్పులపై చెల్లిస్తున్న వడ్డీలు, గ్రాంట్లు, వివిధ రంగాల వస్తున్న ఆదాయం, సంక్షేమానికి వెచ్చిస్తున్న మొత్తం తదితర వివరాలతో ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలుగు భాషలో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, ప్రజా అభిప్రాయ సేకరణ జరిపి, అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని సూచించారు.

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. టీటీడీ ఆగమపండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేనారాధన, పుణ్యావచనం, మేదినిపూజ, అంకురార్పణ, వేదస్వస్తి తదితర పూజలు నిర్వహించారు. సభకు ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, బ్రహ్మనిష్టానంద సరస్వతీస్వామి, బృందావన్ జీయర్ స్వాములు భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగ నాయకి కుంభాభిషేక విశిష్టతను వివరించారు. సభలో అతిథులుగా మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, బీజేపీ రాష్ట్ర నాయకులు జూపూడి రంగరాజు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వర రావు పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్ట ప్రభాకరరావు, సూర్యదేవర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

రోగులకు బియ్యం పంపిణీ

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం వద్ద పేషంట్ డాక్టర్ ఇంట్రాక్షన్ అనే కార్యక్రమం సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ గతవారం ప్రారంభించారు. అందులో భాగంగా శనివారం రోగులు, వారి సహాయకుల సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడే పరిష్కరించారు. షాపర్ స్టాఫ్ సౌజన్యంతో రోగులు, వారి సహాయకులకు బియ్యం పంపిణీ చేశారు.

రంజాన్.. ఆరోగ్యమంత్ర

- బలవర్ధకమైన ఆహారం శ్రేష్టం
- ఉపవాసంలో సరైన ఆహారం తీసుకోవాలి
- లేని పక్షంలో అనారోగ్యం రావొచ్చు
- దీక్షల వేళ... తీసుకునే ఆహారం ఎంతో కీలకం



రంజాన్‌లో తీసుకునే ఆహారం

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించనున్నారు. నెలవంక దర్శనమివ్వడంతో నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్ష చేపట్టనున్నారు. దీక్షల సమయంలో సూర్యుడి ఉదయించకముందే కొద్దిపాటి ఆహారం తీసుకుని మళ్లీ సాయంత్రం సూర్యుడు అస్తమించే వరకు దీక్షతో ఉపవాసం ఉంటారు. ఏమీ తినకుండా రోజంతా ఉంటే ఏదైనా అనారోగ్యం కూడా వాటిల్లే ప్రమాదం ఉంది. ముస్లింలు దీక్షల సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవటం ద్వారా నీరసించి పోకుండా గ్యాస్ సంబంధిత సమస్యలు రాకుండా జాగ్రత్తలు వహించాలి. రంజాన్ ఉపవాసం సమయంలో సహర్(సూర్యోదయానికి ముందు భోజనం), ఇఫ్తార్ (సూర్యాస్తమయం తర్వాత భోజనం) ముఖ్యమైనవి. శక్తిని నిలుపుకోవడం, ఆరోగ్యంగా ఉండటం కోసం సరైన ఆహారం తీసుకోవాలి.

సహర్ కోసం ఆహారాలు:

ఓట్స్: ప్రోటీన్, ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోజంతా శక్తిని అందిస్తాయి

పెరుగు: జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. నట్స్ లేదా బెరస్ కలిపి తినవచ్చు

చిలగడదుంపలు: కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ మరియు ఫైబర్ అధికంగా ఉన్నాయి, శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి

చియా గింజలు: ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్ పుష్కలంగా ఉండి రోజంతా హైడ్రేట్‌గా ఉంచుతాయి

ఇఫ్తార్ కోసం ఆహారాలు:

ఖర్జూరాలు: సహజ చక్కెరలతో శక్తిని వెంటనే అందిస్తాయి.

సూప్స్: లేత సూప్‌లు జీర్ణక్రియకు మేలు చేస్తాయి.

ఫ్రూట్ సలాడ్: నీటి శాతం అధికంగా ఉండే పండ్లను చాట్ మసాలాతో కలిపి తినవచ్చు

హలీమ్: మాంసం, గోధుములతో తయారుచేసి ప్రోటీన్, కార్బోహైడ్రేట్స్ ఆహారం

సాధారణ సూచనలు:

నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాలు (పండ్లు, కూరగాయలు) తీసుకోవాలి.

ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారం, ఎక్కువ నూనె వాడిన పదార్థాలు తగ్గించాలి.

ఉపవాసం విరమించిన వెంటనే నీరు లేదా జ్యూస్ తాగడం మంచిది.

ఈ విధంగా పోషకాహారాన్ని సమతుల్యంగా తీసుకుంటే ఉపవాసం సమయంలో శక్తివంతంగా ఉండవచ్చు.

రంజాన్ ఉపవాసం తర్వాత తీసుకోవాల్సిన ఆహారం....

ఖర్జూరాలు: ఇవి సహజ చక్కెరలతో నిండి ఉంటాయి, శక్తిని త్వరగా అందిస్తాయి. ఉపవాసం తర్వాత వీటిని తినడం ద్వారా శరీరానికి అవసరమైన ద్రవాలను పునరుద్ధరించగలుగుతాయి.

హలీమ్: ఇది ప్రోటీన్, కొవ్వులు, మరియు కాల్షియం పుష్కలంగా ఉండే వంటకం. శక్తిని త్వరగా అందించడానికి ఇది అనుకూలంగా ఉంటుంది.

కునాఫా: ఇది రంజాన్ సమయంలో ప్రసిద్ధి చెందిన తీపి వంటకం, శక్తిని త్వరగా అందిస్తుంది.

సలాడ్లు: పండ్లు మరియు కూరగాయల మిశ్రమం, ఇది ఫైబర్ మరియు ఇతర పోషక విలువలతో నిండి ఉంటుంది. తేలికగా మరియు ఆరోగ్యకరంగా ఉంటుంది.

పప్పులు, బీన్స్: ఇవి ప్రోటీన్ , ఫైబర్ అందిస్తాయి, ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చిలగడదుంపలు: ఇవి కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ , ఫైబర్ పుష్కలంగా ఉంటాయి, శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి.

పాల ఉత్పత్తులు: పెరుగు లేదా పాలతో తయారు చేసిన వంటకాలు జీర్ణవ్యవస్థకు మేలు చేస్తాయి.

రంజాన్ మాసంలో శ్రేష్టమైన ఆహారాలు ఇవే

కబాబ్: కబాబ్ తయారు చేయడానికి హలాల్ మాంసాలు ఉపయోగిస్తారు

ఫత్తూష్ సలాడ్: రంజాన్‌లో తేలికగా ఉండాలని కోరుకునేవారికి ఇది మంచి ఎంపిక

పకోడీ: ఉల్లిపాయలు, వంకాయలు, మిరపకాయలతో తయారుచేస్తారు, ఇది ఉత్తమ శాఖాహార ఎంపిక

ఖీర్: ఇది ముస్లింలకు ఎంతో ఇష్టమైన స్వీట్, జీడిపప్పు, బాదం, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేస్తారు

కునాఫే: సేమ్యా, పండ్లతో తయారు చేస్తారు, ప్రాంతాన్ని బట్టి వంటకాల విధానం మారుతుంది

హలీమ్: ఇది రంజాన్ మాసంలో తప్పనిసరిగా ఉండాల్సిన వంటకం. మాంసంలో డ్రై ఫ్రూట్స్, మసాలాలు కలిపి పేస్ట్ లాగా ఉడికిస్తారు

కిబ్బే: గోధుమ లేదా మైదా పిండిలో పచ్చి మాంసం పెట్టి బాల్స్ లాగా డీప్ ఫ్రై చేస్తారు

చాట్ ఫ్రూట్ సలాడ్: అన్ని రకాల పండ్ల ముక్కలతో చాట్ మసాలా కలుపుకుని తింటారు.

బక్లావా: ఇది రంజాన్ ఆచారంలో ముఖ్యమైన స్వీట్, వేరుశెనగ, తేనె, సుగంధ ద్రవ్యాలు, పిండితో తయారుచేస్తారు.

ఖర్జూరం: ఇఫ్తార్‌లో ఖర్జూరాలు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. ఇందులో గ్లూకోజ్, సుక్రోజ్లు ఉంటాయి.

సుహూర్ సమయంలో ఓట్స్, చిలగడదుంపలు, పాలకుర, పెరుగు తీసుకోవడం వల్ల రోజంతా శక్తివంతంగా ఉంటారు.

గ్యాస్ సమస్యలు రాకుండా ఉండాలంటే ....



ఉపవాసం ప్రారంభించే సమయంలో(సెహ్రీ) మంచి న్యూట్రిషియస్ ఆహారం తీసుకోవాలి. ఎక్కువ ప్రోటీన్, ఫైబర్ ఉన్న ఆహారాలు, పండ్లు, కూరగాయలు ధాన్యాలు తీసుకోవడం మంచిది. ఇఫ్తార్ సమయంలో ఒకేసారి ఎక్కువ ఆహారం తినకుండా, చిన్న భాగాలుగా తినడం మంచిది. మొదట కుర్మా లేదా ఖర్జూరంతో ప్రారంభించి, తరువాత మిగతా ఆహారాన్ని తీసుకోవడం వలన గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. నీరు, నిమ్మరసం , మజ్జిగ వంటి పానీయాలను తీసుకోవాలి.

–డాక్టర్ షేక్ నాగూర్ బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు.

14న గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

పట్నంబజారు: అరుణాచల పుణ్యక్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న గిరి ప్రదక్షిణకు ఈనెల 14న ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ శనివారం తెలిపారు. ఈనెల 12 రాత్రి బస్సు బయల్దేరుతుందని, 13వ తేదీ ఉదయం కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకున్న అనంతరం అదేరోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. భక్తులు గిరిప్రదక్షిణ చేసుకుని స్వామి దర్శనం అనంతరం తిరిగి 15వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందన్నారు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలనుకునే వారు 96164 సర్వీసు నంబరులో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. టికెట్టు ధర రూ.2,420 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7382877459, 7382896403 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సహకారంతో ఉన్నతి ఫౌండేషన్ విద్యార్థినులకు 30 రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. విద్యార్థినుల భవిష్యత్ కెరీర్ వృద్ధికి ప్రాధాన్యమిస్తూ, క్యాంపస్ ఉద్యోగ నియామాకాల్లో ఉద్యోగాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ కల్పించినట్లు వివరించారు. గ్రూప్ డిస్కషన్, మాక్ ఇంటర్వ్యూలు, వ్యక్తిగత ప్రాజెక్టుల ద్వారా తగిన అనుభవాన్ని పొందారని తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ, గోవింద్, గాయత్రి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూ నగర్: నగరంలో వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరాకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పైప్‌లైన్ లీకు మరమ్మతులు, డొంక రోడ్‌లోని మూడు వంతెనల వద్ద పనులు, నగరంలో పింఛన్ పంపిణీ, అమరావతి రోడ్ ఐడీ హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్‌ని శనివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియం రిజర్వాయర్ వద్ద పైప్ లైన్ లీకు మరమ్మతులు శనివారం నాటికి పూర్తి చేసి ఆదివారం ఉదయం నుంచి సరఫరా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని కోరారు. మూడు వంతెనల దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించి, రైల్ పేట నుంచి వచ్చే డ్రెయిన్ నీటిని నేరుగా మేజర్ డ్రెయిన్‌లోకి కలిపేలా నూతన కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. పర్యటనలో ఈఈ సుందర్‌రామిరెడ్డి, డీఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, ఏసీపీ మల్లికార్జున, ఆర్‌ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై అనధికార చేపలు మాంస విక్రయాలు జరిపితే చర్యలు

నెహ్రూ నగర్: నగరంలోని రోడ్లపై నాటు కోళ్లు, చేపలు, మాంస అనధికార విక్రయాలు చేయడానికి వీలులేదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఆదేశించారు. నగర పరిధిలోని ప్రధాన, అంతర్గత రోడ్లపై అనధికారిక నాటుకోళ్లు, చేపలు, మాంస విక్రయాలు జరగకుండా ప్రజారోగ్య అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార విక్రయాలు చేసే వారికి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించటమే కాకుండా చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

కారు ఢీకొని ఎంబీబీఎస్ విద్యార్థిని మృతి



తాజ్‌అఫ్షా మృతదేహం

నందిగామ రూరల్: ఇబ్రహీంపట్నం (మైలవరం): రెండు నిమిషాల్లో కళాశాలకు చేరాల్సిన వైద్య విద్యార్థినిని రోడ్డు ప్రమాదం కారు రూపంలో బలితీసుకుంది. మరో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఇబ్రహీంపట్నం మండలం జూపూడి వద్ద నిమ్రా వైద్యకళాశాల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్షా (20), చిత్తూరు టౌన్ దుర్గాకాలనీకి చెందిన అలేజ్ అహ్మద్ జూపూడిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటూ స్థానిక నిమ్రా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. ఉదయం కళాశాలకు స్కూటీపై వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న తాజ్ అఫ్షా(20) తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న అలేజ్ అహ్మద్ తీవ్రంగా గాయపడింది. ఆమెను తొలుత సమీపంలో నిమ్రా వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన తాజ్ అఫ్షా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విజయవాడ ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీపీ చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు సంపద సృష్టికర్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న శివారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సంపద సృష్టికర్తలుగా ఎదగాలని హిందుస్థాన్ కోకోకోలా బేవరేజెస్ ప్రైవేటు లిమిటెడ్ పబ్లిక్ అఫైర్స్ మేనేజర్ యు.శివారెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ ఆధ్వర్యంలో శనివారం 'ఎసోటెరిక్–2025' పేరుతో అంతర కళాశాలల మేనేజ్‌మెంట్–కామర్స్ విద్యార్థుల కలయిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివారెడ్డి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్, కామర్స్ విద్యార్థులు సంపద సృష్టికర్తలని, ఆలోచనలే పెట్టుబడిగా, అవకాశాలు ఏర్పాటు చేసుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ఎంతో అవసరమన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగి, తోటి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పించేస్థాయికి ఎదగాలన్నారు. సమాజంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని గుర్తించి ఆయా రంగాల్లో రాణించాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి మాట్లాడారు. క్విజ్‌లో ఆర్వీఆర్ జేసీ, టీజేపీఎస్, స్టాక్ మార్కెటింగ్‌లో టీజేపీఎస్, ఆర్వీఆర్ జేసీ వరసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో కన్వీనర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, శ్రీనివాసరావు, నాగ నిర్మల, యు.రవికుమార్ పాల్గొన్నారు.

ఆచరణ సాధ్యం కాని రాష్ట్ర బడ్జెట్

లక్ష్మీపురం: ఆచరణ సాధ్యం కాని అంకెల గారిడీగా రాష్ట్ర బడ్జెట్ ఉందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం బడ్జెట్ విశ్లేషణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర ఉపన్యాసకులు సి.హెచ్.సుబ్బారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సమతూకం పేరుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీ బడ్జెట్‌లా ఉందని విమర్శించారు. రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లోనైనా హామీల అమలుకు నిధులు కేటాయిస్తారని ప్రజలు ఎంతగానో ఎదురు చూశారన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో వైజ్ఞానిక ప్రతిభకు పునాది



గుంటూరు ఎడ్యుకేషన్: విజ్ఞాన ప్రదర్శనలతో వైజ్ఞానిక ప్రతిభకు పునాది పడుతుందని ప్రముఖ మనోవిజ్ఞానశాస్త్ర నిపుణుడు డాక్టర్ బి.వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం బుచ్చయ్యతోట ఒకటో లైనులోని శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు తమలోని సృజనాత్మక నైపుణ్యాలకు పదునుపెట్టి, అద్భుతమైన ప్రాజెక్టులను రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. ప్రతిభను పదునుపెట్టి ఉన్నత భవిష్యత్తు పొందాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ విద్యార్థులతో 160 వైవిధ్యమైన ప్రాజెక్టులను తయారు చేయించడంతోపాటు వాటి విశేషాలను స్వయంగా వారే వివరించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం డాక్టర్ ఎన్.అంజయ్య, సమన్వయకర్త మూర్తి, ఇన్‌చార్జులు దుర్గారావు, సుమ, దీప పాల్గొన్నారు.

బాలకుటీర్‌లో అలరించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా ప్రదర్శనను ప్రారంభించిన కిమ్స్ ఆస్పత్రి వైద్య నిపుణుడు మాలెంపాటి రాజశేఖర్, రమ్య ప్రైమరీ, ప్రీ–ప్రైమరీ విద్యార్థుల భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, వారిలోని సృజనాత్మకతను అభినందించారు. విద్యార్థుల మానసిక వికాసానికి విద్యతోపాటు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. బుద్ధం శరణం గచ్ఛామి అంటూ శాంతిని, అక్షరాలతో పదవిన్యాసాలు, నిత్య జీవితంలో గణితశాస్త్ర ప్రాధాన్యతను కృత్యాల ద్వారా విద్యార్థులు తెలియజేశారు. పెరుగుతున్న కాలుష్యానికి నివారణ మార్గాలు, ప్రస్తుత కాలంలో ప్రయాణీకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, విధి విధానాలను చక్కటి భాషతో వివరించారు. మానసిక ఒత్తిడిని దూరంచేసే లలితకళలు ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల సీఏఓ దుర్గా రఘురామ్, సంయుక్త కార్యదర్శి జయశ్రీ, ప్రిన్సిపాల్ సుధామాధవి పర్యవేక్షించారు.

సృజనాత్మక నైపుణ్యంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధి



గుంటూరు ఎడ్యుకేషన్: సృజనాత్మక నైపుణ్యంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి శ్రీకారం చుట్టవచ్చునని ప్రముఖ సీఏ పి.గోపీకృష్ణ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం క్రియేటివ్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యలను వెలికితీయడంలో నైపుణ్య ప్రదర్శనలు ఉపయోగపడతాయని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన వైజ్ఞానిక ప్రతిభతోపాటు వివిధ రంగాల్లో వారికి గల ఆసక్తిని వెలుగులోకి తెచ్చేందుకు ప్రదర్శన వేదికగా నిలిచిందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ మాట్లాడారు.

అటెండర్‌కు బెనిఫిట్స్ అందజేత

నెహ్రూనగర్: ప్రభుత్వ ఉద్యోగి తన సర్వీస్ సమయంలో కుటుంబ సభ్యుల కంటే కార్యాలయ సిబ్బందితోనే ఎక్కువ అనుబంధం కలిగి ఉంటారని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ చేసిన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ అటెండర్ షేక్ కాలేషాని కమిషనర్ చాంబర్‌లో అభినందించి, పీఎఫ్ బెనిఫిట్స్ చెక్‌లు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ షేక్ కాలేషా ఆఫీస్ అటెండర్‌గా 34 ఏళ్ల పాటు సర్వీస్ చేశారని, ఉద్యోగ విరమణ అనంతరం మంచి ఆరోగ్యంతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవితం గడపాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. కాలేషాకు కార్యాలయం నుంచి అందాల్సిన గ్రాట్యూటీ, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ వేగంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సుందర్‌రామిరెడ్డి, ఏఈలు వెంకటేశ్వర రావు, ప్రసాద్, సూపరింటెండెంట్ ఎస్ఎన్ ప్రసాద్, అకౌంటెంట్ నమ్రత్ కుమార్ పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ డేటాలో నమోదు చేసుకోవాలి

నెహ్రూ నగర్: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నివాసం ఉండే ప్రతి ఒక్కరూ స్థానిక వార్డు సచివాలయం హౌస్ హోల్డ్ డేటాలో తప్పనిసరిగా నమోదై ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మిస్సింగ్ సిటిజన్ సర్వే చేపట్టిందని, అందులో భాగంగా నగరంలో నివసించే ప్రతి ఒక్కరినీ స్థానిక వార్డు సచివాలయం పరిధిలో హౌస్ హోల్డ్ డేటాలో నమోదు చేయనున్నట్లు వివరించారు. డేటాలో ప్రభుత్వ ఉద్యోగులతో సహా నగరంలోని ప్రతి ఒక్కరూ నమోదు కావాల్సి ఉంటుందని చెప్పారు. భవిష్యత్‌లో భూ పట్టాలు, అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాలు, పాస్ పోర్ట్, ఆధార్ సేవలు, పుర సేవలు అందడానికి హౌస్ హోల్డ్ డేటాలో నమోదు తప్పనిసరి అని అన్నారు. ప్రభుత్వ సేవలు, సమాచారం, సంక్షేమ పథకాలు అందించడానికి కూడా డేటా ప్రధానమైనదని తెలిపారు. అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ, గ్రూప్ హౌస్ ల్లో ఉండేవారిలో ఎక్కువ మంది మిస్సింగ్ సిటిజన్ కేటగిరిలో ఉన్నారని, అటువంటి వారు తమ వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు తగిన సమాచారం అందించి సహకరించడం ద్వారా హౌస్ హోల్డ్ డేటాలో నమోదు కావాలని, సదరు నమోదుపై ఏ విధమైన అపోహలు పెట్టుకోవద్దని కోరారు.

పరిశ్రమల అనుసంధానంతో ఉద్యోగావకాశాలు

ఏఎన్‌యూ ప్రొఫెసర్ శివరామ్ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశ్రమలు, విద్యాసంస్థల అనుసంధానంతో విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఏఎన్‌యూ వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం 'స్ఫూర్తి ది ఐక్యూబ్ ఎక్స్‌పో' పేరుతో విద్యాసంస్థలు– వైద్యశాలలు, పరిశ్రమల అపూర్వ కలయిక నిర్వహించారు. ఈసందర్భంగా శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యాసంస్థల పరస్పరంగా ప్రదర్శన నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన అవకాశాన్ని కల్పిస్తోందని, విద్యార్థులు కెరీర్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఐటీసీ హెచ్ఆర్ ఉపాధ్యక్షుడు పి.వీరాస్వామి మాట్లాడుతూ విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమను తాము మలచుకోవడంలో ప్రయోజనం చేకూర్చుతుందని పేర్కొన్నారు. హిందూ కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు డి.సాయినాథ్ మాట్లాడుతూ ఎంబీఏ అనేది ఒక ప్రత్యేకత కలిగిన ప్రోగ్రాం అని, తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రయోగాత్మకంగా పరిశ్రమలతో అనుసంధానం ద్వారా నేర్చుకోగలుగుతారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమల నిపుణులతో నేరుగా సంభాషించే అవకాశాన్ని కల్పించడం ప్రదర్శన ప్రధాన ఉద్దేశమన్నారు. ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ కె.లలిత, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సహాయాచార్యులు వేదవతి, అభిలాష్, అనిత, రాజరాజేశ్వరిదేవి, ఎంసీఏ విభాగాధిపతి రాజ్యలక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హిడెన్ స్టార్స్ స్కూల్ వార్షికోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని హిడెన్ స్టార్స్ పాఠశాల తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా ది జంగిల్ సఫారీ నినాదంతో అడవిలోని అద్భుతాలు, శక్తివంతమైన జీవులు, గిరిజన సంస్కృతి, ప్రకృతి సౌందర్యాన్ని చిన్నారులు ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ ఎస్.శ్యామల మాట్లాడుతూ చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు జంగిల్ సఫారీ నినాదంతో కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా చిన్నారుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలో కార్యక్రమం కొనసాగింది.